క్లుప్తంగా

భవనం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

అర్వపల్లి : అర్వపల్లిలో చేపట్టిన తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం స్మారక భవన నిర్మాణ పనులను గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పరిశీలించారు. పోరాటయోధురాలు స్వరాజ్యం జ్ఞాపకార్థం స్మారక భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న సీఐ రజిత

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ కల్లుగీత కార్మికులకు మంజూరైన కాటమయ్య రక్షణ కిట్లను తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత విభాగం కార్యదర్శి, టీటీసీఎస్ అధ్యక్షుడు బద్దం యాదగిరిగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోనే అత్యధికంగా కాసర్లపహాడ్ గ్రామానికి కాటమయ్య కిట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఖమ్మంపాటి సాంబయ్య, సంఘం సభ్యులు ఉయ్యాల చిన లింగయ్య, కర్ణయ్య, పెదవెంకన్న, చినవెంకన్న, చినఅంజయ్య, లక్ష్మయ్య, జానయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

అర్వపల్లి : బాల్య వివాహాలు చేయడం నేరమని ఎంపీడీఓ టి.గోపి అన్నారు. కుంచమర్తి గ్రామంలోని ఎస్సీకాలనీలో గురువారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంటరానితనం నిషేధమని, కులమతాలకతీతంగా అంతా కలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ రామరాజు జలేంధర్‌రావు, హెచ్‌డబ్ల్యూఓ కాటూరి రామానుజాచార్యులు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌరుల హక్కులకు భంగం కలిగించొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ లాలు

పెన్‌పహాడ్ : సమాజంలో పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ లాలు అన్నారు. గురువారం చెట్లముకుందాపురం గ్రామంలోని హరిజన కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమానత్వంతో కలిసిమెలసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపికృష్ణ, ఏఆర్ఐ అజీజా, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

స్వామీజీలు ఆలయ సందర్శన



ఆలయాన్ని సందర్శించిన స్వామీజీలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన స్వామీజీలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు రాంబాబుఅయ్యంగార్ స్వామీజీలకు ఆలయ చరిత్రను తెలియజేశారు. అనంతరం భరద్వాజ ఆశ్రమంను కూడా స్వామీజీలు సందర్శించారు. కార్యక్రమంలో శ్రీస్వామి నారాయణ్ ఇంటర్నేషనల్ గురుకుల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్ ఆనంద్, స్వామీజీలు రుషిస్వామీజీ, కృష్ణమూర్తిస్వామీజీ, అర్చకులు అర్వపల్లి రాంబాబు, పవన్, రామకృష్ణ చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.50వేలు విరాళం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో కార్గిల్‌లాన్స్ నాయక్ పోలోజు గోపయ్య చారి మెమోరియల్ గ్రంథాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ నలబోలు వెంకట్‌రెడ్డి–సుజాత దంపతులు గురువారం రూ.50వేల విరాళం ఇచ్చారు. ఆ నగదును గ్రంథాలయ నిర్వాహణ కమిటీ సభ్యులు కొండమీది శ్రీను, పోలోజు సత్యనారాయణచారిలకు అందజేశారు.



విరాళం అందజేస్తున్న దాత వెంకట్‌రెడ్డి

బడుల బలోపేతానికి బాధ్యతగా...

- సొంత ఖర్చులతో వసతులు కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థుల రవాణా సౌకర్యార్థం ఆటోల ఏర్పాటు

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, కొందరు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఇది ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లేలా చేస్తోంది. అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెట్లముకుందాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఈ గొప్ప పనికి ఆదర్శంగా నిలిచారు. సింగారెడ్డిపాలెం గ్రామం నుంచి అనంతారం పాఠశాలకు దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలాగే కొత్త ఊరు కాలనీ నుంచి చెట్లముకుందాపురం పాఠశాలకు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దూరాలను నడిచి వెళ్లడానికి విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలు రవాణా సౌకర్యాలు కల్పించడంతో తల్లిదండ్రులు ఆ వైపు మొగ్గు చూపేవారు. అయితే ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి (అనంతారం), గోపతి రామారావు (చెట్లముకుందాపురం)తో పాటు ఇతర ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారు తమ సొంత నిధులను సమీకరించుకుని విద్యార్థుల కోసం ఆటోలను ఏర్పాటు చేశారు. ఫలితంగా సింగారెడ్డిపాలెం నుంచి 46 మంది విద్యార్థులు, కొత్త ఊరు కాలనీ నుంచి 20 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.



అనంతారంలో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు



చెట్లముకుందాపురంలో..

ఆటోల సౌకర్యం – ఒక ఆదర్శం..

చెట్లముకుందాపురంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు కలిసి ప్రతి నెలా రూ.5,000 చెల్లించి ఆటో సౌకర్యం అందిస్తున్నారు. అదేవిధంగా అనంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆటో సౌకర్యం కోసం హెచ్ఎం, ఉపాధ్యాయులు గ్రామస్తుల సహకారంతో ప్రతి నెలా రూ.9,000 చెల్లిస్తున్నారు. ఈ ఉపాధ్యాయుల అంకితభావం, నిస్వార్థ సేవను ఆయా గ్రామాల ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయ బృందం ప్రతి పాఠశాల బలోపేతం కోసం కృషి చేస్తే, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సహకారం ప్రశంసనీయం

“ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో విద్యార్థులకు ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు. మా గ్రామం నుంచి 46మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. ప్రభుత్వ బడి బలోపేతానికి ఉపాధ్యాయులు తీసుకుంటున్న చొరవ అభినందనీయం.



– షరీఫ్, మాజీ సర్పంచ్, సింగారెడ్డిపాలెం

సమష్టి కృషితో నిర్ణయం

“పాఠశాల పరిధిలో విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించాం. తల్లిదండ్రుల కోరిక మేరకు ఉపాధ్యాయుల సమష్టి కృషితో నిర్ణయం తీసుకున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది.



– మల్లారెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం, అనంతారం

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి, విద్యార్థులు, తదితరులు

- మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి

సూర్యాపేట అర్బన్ : పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. వన మహోత్సవం, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో గురుకుల సొసైటీ ఫిఫ్త్ జోన్ జోనల్ ఆఫీసర్ ఎస్.విద్యారాణి, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఇప్పటి తరం విద్యార్థులు భవిష్యత్ పర్యావరణ రక్షకులు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీ విద్యాసాగర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టీపీఓ సోమయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, నర్సరీ ఇన్‌చార్జ్ వసుంధర, వైస్ ప్రిన్సిపాల్స్ బి.యాదయ్య, జి.రమేష్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, నరేష్, కృష్ణారెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఏఎల్ఓలను కేటాయించాలని వినతి

సూర్యాపేట : సూర్యాపేట, కోదాడకు రెగ్యులర్ ఏఎల్ఓలను కేటాయించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం లేబర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణాల కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు గంట నాగయ్య, దేశోజు మధు మాట్లాడారు. రెగ్యులర్ ఏఎల్ఓలు లేకపోవడంతో జిల్లాలో గత నాలుగు సంవత్సరాల నుంచి భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణాల కార్మిక సంఘం నాయకులు డి.సైదులు, పురుషోత్తం, కళ్యాణ్, నాగరాజు, లింగమల్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గిరిజనుల హక్కులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న రాజారాం, పాల్గొన్న నాయకులు

తుంగతుర్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను విస్మరిస్తున్నాయని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజారాం విమర్శించారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని పద్మశాలీ భవనంలో జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు గిరిజనుల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తున్నాయని తెలిపారు. గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోత్ నరేష్, ఉపాధ్యక్షులుగా బి.సతీష్, బానోత్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ మనోజ్, సహాయ కార్యదర్శులుగా గుగులోతు నరేష్, భాస్కర్, కోశాధికారిగా జాటోత్ పవన్, కార్యవర్గ సభ్యులుగా ఇస్లావత్ రాజు, సురేందర్, వెంకన్న, శంకర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు బి.ప్రతాప్, నరేష్, ఇస్లావత్ భాస్కర్, జాటోతు పవన్, సురేందర్, శీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన



నాగారం : అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నాగారం : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ యనగందుల నాగరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని వర్ధమానుకోట, ఈటూరు జెడ్పీహెచ్ఎస్‌లలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, పల్లె దవాఖానా డాక్టర్ నాజీయా, మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, హెచ్ఎంలు బుర్హనోద్దీన్, కృష్ణవేణి, సూపర్‌వైజర్ రామచంద్ర, వైద్యసిబ్బంది ఎల్లమ్మ, బేబీ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పెన్‌పహాడ్ : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి రాజేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది తాడూరి వెంకన్న, హెల్త్ అసిస్టెంట్లు వీరమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కోదాడరూరల్ : కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం పట్టణంలోని సాలార్జంగ్ పేటలో ఉన్న ఆ సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్వపల్లి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రాంబాబు, ఉపాధ్యక్షుడిగా చాప గోవిందరావు, సహాయ కార్యదర్శిగా ఓరుగంటి శ్రీనివాసరావు, కోశాధికారిగా సముద్రాల బద్రీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అదే విధంగా గుమస్తాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనంతు సైదులు, ఉపాధ్యక్షుడిగా వెంకటరాజారావు, ప్రధాన కార్యదర్శిగా వేమూరి నరసింహ మూర్తి, సహాయ కార్యదర్శిగా కొల్ల సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గట్ల కోటేశ్వరరావు, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి వీరారెడ్డి, ఓరుగంటి ప్రభాకర్, వెంపటి వెంకటేశ్వరరావు, వెంపటి మధుసూదన్, గుడుగుంట్ల రఘు, పురుషోత్తం, ప్రకాష్, పర్వతాలు, అలీబాయ్, సాయి, వీరయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్లు ఇచ్చేందుకు హామీ

తుంగతుర్తి : నిరుపేదలకు ఇళ్లు ఇచ్చేందుకు ఎమ్మెల్యే సామేల్ హామీ ఇచ్చారని పలువురు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో మండల కేంద్రానికి చెందిన పలువురు నిరుపేదలు తమకు ఇళ్లు ఇవ్వాలని కోరుతూ పోస్టు చేయగా.. ఎమ్మెల్యే స్పందించి వారికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం నిరుపేదలైన గాదంగి రేణుక, అనూష, ఉమ, మామిడి శీను కుటుంబాలను గురువారం వారు కలిసి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు కొండరాజు, వీరబోయిన గంగరాజు, వీరబోయిన రాములు, మంగళపల్లి నాగరాజు, అక్కినపల్లి రాములు, ఉప్పుల శ్రీను, బత్తుల జలేంధర్, కొండా పరశురాం, చంటి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే కేటాయించాలి

నాగారం : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) మండల కన్వీనర్ చిప్పలపల్లి నాగార్జున మహారాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు నిజమైన అర్హులకు అందడం లేదన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారని, కానీ వాటిని పేదలకు కాకుండా పట్టణాలలో వ్యాపారాలు చేసుకుంటూ ఇళ్లు, భూములు ఉన్నవాళ్లకే కేటాయించారని ఆరోపించారు. అనర్హులకు ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ నాయకులు డి.విజయరామరాజు, అనుదీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖీ కేంద్రం



వ్యవసాయ పనులు చేస్తున్న మహిళలకు అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం సభ్యులు

ఆత్మకూర్(ఎస్) : మహిళలకు సఖీ కేంద్రం అండగా నిలుస్తోందని సఖీ కేంద్రం కేస్ వర్కర్ సుజాత అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహిళలకు సఖీ కేంద్రం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహహింస, వరకట్న వేధింపులు, పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఆడ పిల్లల అమ్మకం, అక్రమ రవాణా వంటి సమస్యల నుంచి మహిళలకు, బాలికలకు సఖీ కేంద్రం భరోసా కల్పిస్తుందని తెలిపారు. మహిళలకు సఖీ కేంద్రం ఆధ్వర్యంలో పోలీస్, న్యాయపరమైన సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఏ సమస్య వచ్చినా 181కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం సభ్యులు రజిత, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల గడువు పెంపు

ఆత్మకూర్(ఎస్) : నెమ్మికల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్ల గడువును ఆగస్టు 20వ తేదీ వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మారం హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆత్మకూర్(ఎస్) మండలంతోపాటు సమీప మండలాల్లోని ఆయా గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహకారం అభినందనీయం



విద్యార్థులకు ఐడీకార్డులు అందజేస్తున్న దాతలు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని హెచ్ఎం ఉప్పు నాగయ్య అన్నారు. గురువారం అలుగునూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన 50మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన గూడపురి నర్సింహారావు–యశోదమ్మల జ్ఞాపకార్థం కుమార్తె పడిదల మంగతాయమ్మ–మాధవరావు కుటుంబ సభ్యులు ఐడీకార్డ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నాగేశ్వర్‌రావు, రేణుక, పంచాయతీ కార్యదర్శి రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

సుదీర్ఘకాలం సేవలు అభినందనీయం

- ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ కె.నరసింహ అన్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కంట్రోల్ రూం ఎస్ఐగా పని చేస్తున్న అంతిరెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనను కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్పీ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, ఏఓ మంజు భార్గవి, పోలీసు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ పాల్గొన్నారు.



అంతిరెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ నరసింహ

హోంగార్డు కూతురుకు అభినందన..

సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నాగయ్య కూతురు ఉషశ్రీ ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఉషశ్రీని అభినందించారు.

శ్రీసంతోషిమాత ఆలయంలో ఒడిబియ్యం



అమ్మవార్లకు ఒడిబియ్యం తీసుకెళ్తున్న భక్తులు

సూర్యాపేట : శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో శ్రీవాసవీ సేవా సమితి మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీమానస దేవి, లలితా మాతలకు ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను కీర్తిస్తూ పాటలు పాడారు. శ్రీవాసవీ సేవా సమితి మహిళా సంఘం నాయకులు వీరవెల్లి ఉమ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక రోజు ఆలయాల్లో అమ్మవార్లకు ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు గుండా సుధారాణి, కక్కిరేణి పద్మ, బెలిదే అశోకలక్ష్మి, బ్రహ్మదేవర సరస్వతి, మీలా శ్రీదేవి, బచ్చు పద్మావతి, గుండా సువర్ణ, వరగాని శారద, కుక్కడపు ధనలక్ష్మి, నంద్యాల స్వాతి, గన్నవరపు గీత, పబ్బతి పద్మావతి, శ్రీవాసవీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

లింగన్న పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తాం



సూర్యాపేట : పూనెం లింగన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట : మన్యం వీరుడు, ప్రతిఘటనోద్యమ దళపతి పూనెం లింగన్న పోరాట స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. పూనెం లింగన్న వర్ధంతి సందర్భంగా గురువారం ఎంవీఎన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. లింగన్న నిరుపేద కుటుంబంలో జన్మించి పేద ప్రజల విముక్తి కోసం పోరుబాటలో నేలకొరిగిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నర్సయ్య, వాస పల్లయ్య, సయ్యద్ హుస్సేన్, గులాం హుస్సేన్, మోహన్, వెంకన్న, యాదగిరి, కరుణాకర్, పావని, శ్యామల పాల్గొన్నారు.

ఆదివాసీ ముద్దుబిడ్డ లింగన్న

సూర్యాపేట అర్బన్ : మన్యం వీరుడు, ప్రతిఘటనోద్యమ దళపతి, ఆదివాసీ ముద్దుబిడ్డ పూనెం లింగన్న అని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. గురువారం పూనెం లింగన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం నిర్వహించిన ప్రతిఘటన పోరాటంలో లింగన్న అమరత్వం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎ.నాగయ్య, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బండి రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, పెద్దింటి అశోక్ రెడ్డి, ప్రవీణ్, పద్మక్క, నరసయ్య, రాములు, కళ్యాణ్, వెంకన్న పాల్గొన్నారు.

లింగన్న ఆశయసాధనకు కృషి చేయాలి

అర్వపల్లి : భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు పూనెం లింగన్న ఆశయ సాధనకు అంతా కలిసి పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పోలెబోయిన కిరణ్ కోరారు. అర్వపల్లిలో గురువారం లింగన్న 6వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఈదురు వీరపాపయ్య, పగిడి సోమయ్య, భార్గవ్, లక్ష్మణ్, నర్సయ్య పాల్గొన్నారు.

నాగారం : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు పూనెం లింగన్న ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బొడ్డు శంకర్, మాజీ సర్పంచ్ యానాల సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం లింగన్న వర్ధంతి సందర్భంగా డి.కొత్తపల్లి స్టేజీ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఏషబోయిన లింగయ్య, గాడుదల శ్రీను, ఏనుగుల లింగస్వామి, అక్కిరెడ్డి సైదులు, కడారి సైదులు, దేవరకొండ కృష్ణ, ఏర్పుల శ్రీను, మధు, సత్యనారాయణ, నర్సయ్య, లింగయ్య పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెన్‌పహాడ్ : రైతులు పెసర పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం గాజులమల్కాపురంలో పెసర పంటను పరిశీలించి మాట్లాడారు. పెసర పంటకు సోకే తెల్లదోమ, తామర పురుగు నివారణకు అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, రైతు గుండు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

షుగర్, బీపీ పరీక్షలు

అర్వపల్లి : సూర్యానాయక్‌తండాలో గురువారం గిరిజనులకు వైద్యసిబ్బంది షుగర్, బీపీ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నగేష్‌నాయక్, టీబీ నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలి

తుంగతుర్తి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని యువ వికాస్ కోఆర్డినేటర్ పూర్ణ శశికాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో ఉండి, చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, పీడీ యాకయ్య, సూర్యాపేట లయన్స్ క్లబ్ జెడ్సీ లక్ష్మారెడ్డి, ఆర్సీ సంతోష్, తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి, కోశాధికారి గుండగాని రాము, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్, కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, యాదగిరి గౌడ్, గుమ్మడవెల్లి సోమన్న, ఓరుగంటి సుభాష్, వంగాల వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్ణ శశికాంత్

నానో యూరియాపై అవగాహన

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోటలో పత్తి రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, ప్రయోజనాలపై వ్యవసాయశాఖ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్‌బాబు మాట్లాడారు. నానో యూరియా ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. నానో యూరియా 500 మిల్లీ లీటర్ బాటిల్ సుమారు 45 కేజీల యూరియా బస్తాకు సమానం అని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల పంట దిగుబడి 10 నుంచి 15శాతం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవయసాయ శాఖ అధికారి కృష్ణకాంత్, ఐఎఫ్ఎఫ్‌సీఓ మార్కెటింగ్ అధికారి శరత్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే కార్డన్ సెర్చ్

నడిగూడెం : ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం నడిగూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు విక్రయించే వాహనాలను కొనుగోలు చేయవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని 41 బైక్‌లు, 4 ఆటోలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.